
సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

ఆదివారం । 16 । మార్చి । 2025




టన్ను చీనీ రూ.25,200

అనంతపురం మార్కెట్‌యార్డులో శనివారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.25,200, కనిష్టంగా రూ.4,750 ప్రకారం ధర పలికాయి.



స్థిరంగా టమాట ధర

టమాట ధర స్థిరంగా కొనసాగుతోంది. శనివారం కక్కలపల్లి మండీలో కిలో టమాట గరిష్టంగా రూ.8 కనిష్టంగా రూ.5 ప్రకారం ధర పలికింది.



న్యూస్‌రీల్

ముగిసిన ఇంటర్ పరీక్షలు



మంగళకర కళాశాల పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న ఎస్పీ రత్న

పుట్టపర్తి/పుట్టపర్తి టౌన్: జిల్లాలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం జనరల్ విభాగం పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. చివరి రోజు శనివారం కెమిస్ట్రీ/కామర్స్/సోషియాలజీ, ఒకేషనల్ గ్రూపులకు సంబంధించి ఫైన్ ఆర్ట్స్ పరీక్షలు జరిగాయి. జనరల్ విద్యార్థులు 9,057 మందికి గాను 8,877 మంది, ఒకేషనల్ కోర్సులకు సంబంధించి 785 మందికి గాను 745 మంది హాజరైనట్లు జిల్లా ఇంటర్మీడియెట్ విద్యాశాఖాధికారి రఘునాథరెడ్డి తెలిపారు. మొత్తంగా 214 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారన్నారు. ద్వితీయ సంవత్సరం ఒకేషనల్ గ్రూపులకు సంబంధించిన విద్యార్థులకు ఈనెల 18, 20వ తేదీల్లో పరీక్షలు ఉంటాయని వెల్లడించారు.

ఇంటర్ కేంద్రాన్ని తనిఖీ చేసిన ఎస్పీ

ఇంటర్ పరీక్షలకు పటిష్ట బందోబస్తు ఏర్పాటుచేసినట్లు ఎస్పీ రత్న తెలిపారు. శనివారం ఆమె స్థానిక మంగళకర కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాన్ని, పరిసరాలను పరిశీలించారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. ఎస్పీ వెంట రూరల్ ఎస్‌ఐ లింగన్న ఉన్నారు.

రేపటి నుంచి 'పది' పరీక్షలు

- పకడ్బందీ ఏర్పాట్లు చేసిన అధికారులు
- హాజరు కానున్న 2,23,730 మంది విద్యార్థులు
- జిల్లాలో 104 కేంద్రాల ఏర్పాటు



మాట్లాడుతున్న డీఈఓ కృష్ణప్ప

పుట్టపర్తి: పదో తరగతి వార్షిక పరీక్షలు ఈ నెల 17వ తేదీ (సోమవారం) ప్రారంభం కానున్నాయి. జిల్లా నుంచి 2,23,730 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానుండగా, 104 కేంద్రాలు ఏర్పాటు చేశామని డీఈఓ కృష్ణప్ప శనివారం విలేకరులకు తెలిపారు. 17వ తేదీ ఫస్ట్ లాంగ్వేజ్, 19వ తేదీన సెకండ్ లాంగ్వేజ్, 21న ఇంగ్లిష్, 24న గణితం, 26న ఫిజిక్స్, 28న బయాలజీ, 29న ఒకేషనల్, మార్చి 31న సోషల్ స్టడీస్ పరీక్ష ఉంటుదని తెలిపారు. విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా కేంద్రాల్లో నీటి వసతి, ఫర్నీచర్, ఫ్యాన్లు ఏర్పాటు చేశామన్నారు. మాస్ కాపీయింగ్, కాపీయింగ్‌కు అవకాశం లేకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నామన్నారు. విద్యార్థులు ఉదయం 9 గంటలకే పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని డీఈఓ సూచించారు.

1,400 మంది ఇన్విజిలేటర్ల నియామకం

జిల్లాలో 104 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేస్తుండగా...1,400 మంది ఇన్విజిలేటర్లను నియమించినట్లు డీఈఓ కృష్ణప్ప వెల్లడించారు. అలాగే 104 మంది ఛీఫ్ సూపరింటెండెంట్లు,104 మంది డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లను, 13 మంది అడిషనల్ డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లను నియమించామని తెలిపారు.

శేషవాహనంపై నారసింహుడు

- వైభవంగా ఖాద్రీశుడి బ్రహ్మోత్సవాలు
- గోవింద నామస్మరణతో మార్మోగుతున్న కదిరి





శ్రీవారి దర్శనానికి పోటెత్తిన భక్త జనం (ఇన్‌సెట్‌లో) శేషవాహనంపై కాటమరాయుడు

కదిరి: ఖాద్రీ లక్ష్మీ నృసింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. రోజురోజుకూ భక్తుల సంఖ్య పెరుగుతుండడంతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసిపోతోంది. భక్తుల గోవింద నామస్మరణతో ఖాద్రీ క్షేత్రం మార్మోగిపోతోంది. బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి స్వామివారు శ్రీదేవి, భూదేవి సమేతంగా శేష వాహనంపై తిరువీధుల్లో విహరించి భక్తులకు దర్శన భాగ్యం కల్గించారు. స్వామివారి దివ్య మంగళ రూపాన్ని భక్తులు దర్శించుకుని తన్మయత్వం చెందారు. వైకుంఠంలో స్వామి నిత్యం పవళించి ఉండే శేషతల్పం ఆ స్వామితో పాటే భువికి దిగి వచ్చిందని భక్తుల విశ్వాసం. అందుకే స్వామివారు బ్రహ్మోత్సవాల్లో శేషవాహనంపై ఊరేగుతూ భక్తులకు అభయమిస్తున్నారని వారి నమ్మకం. 'శేషవాహనం ముఖ్యంగా దాస్యభక్తికి నిదర్శనం. ఆ భక్తితో పశుత్వం తొలగి మానవత్వం, దాని నుంచి దైవత్వం, ఆపై పరమపదం సిద్ధిస్తాయి' అని అర్చక పండితులు పేర్కొన్నారు. శేష వాహనంపై ఉన్న స్వామి వారిని దర్శించుకుంటే సర్పదోషం పోతుందని భక్తుల నమ్మకం. ఉత్సవ ఉభయదారులుగా యాదాలం శ్రీనివాసులు, బాలాజీ కుటుంబ సభ్యులు వ్యవహరించారని ఆలయ ఈఓ శ్రీనివాసరెడ్డి తెలిపారు.

అలరిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాలు

భక్తుల కాలక్షేపం కోసం ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో అలరిస్తున్నాయి. అలాగే భక్తుల కోసం ఆలయంలో ఉదయం నుంచి రాత్రి 11 వరకూ నిత్యాన్నదానం కొనసాగుతోంది.

నేడు సూర్య, చంద్రప్రభ వాహనాల్లో విహారం

పుట్టడం, జీవించడం, మరణించడం అనే మూడు ప్రక్రియలు కాలాధీనాలు. కాల స్వరూపుడిని తానేనంటూ భక్తులకు చాటి చెప్పేందుకు శ్రీవారు ఆదివారం పగలు సూర్యప్రభ, రాత్రి చంద్రప్రభ వాహనాలపై తిరువీధుల్లో విహరించనున్నారు.



నృత్యంతో అలరిస్తున్న చిన్నారులు

చదువుకుంటేనే ఉజ్వల భవిష్యత్

- రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్



విద్యార్థినులతో మాట్లాడుతున్న మంత్రి సత్యకుమార్

బత్తలపల్లి: "నేనూ ప్రభుత్వ పాఠశాలల్లోనే చదువుకున్నా. చదువుకుంటేనే పది మంది మనల్ని గౌరవిస్తారు. మంచి భవిష్యత్ ఉంటుంది. ఎన్ని కష్టాలు వచ్చినా చదువును మాత్రం వీడకండి. ఏదైనా కష్టం వస్తే తెలపండి. పరిష్కారానికి చర్యలు తీసుకుంటా" అని రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ విద్యార్థులకు సూచించారు. అహర్నిశలు శ్రమిస్తూ లక్ష్యం దిశగా అడుగులేస్తూ ఉన్నత స్థానాలకు చేరుకోవాలన్నారు. స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో విద్యార్థినుల సౌకర్యార్థం రూ.2 కోట్లతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో బీసీ బాలికల వసతి గృహాన్ని నిర్మించారు. శనివారం మంత్రి సత్యకుమార్ వసతి గృహాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి వసతి గృహంలోని గదులు, సౌకర్యాలను పరిశీలించి, విద్యార్థినుల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థినులతో ఆత్మీయంగా మాట్లాడారు. కార్యక్రమంలో ధర్మవరం ఆర్డీఓ మహేష్, ఎంపీడీఓ నరసింహనాయుడు, జెడ్పీటీసీ సుధ, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జయంతి, పాఠశాల సిబ్బంది, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

హంద్రీనీవా కాలువ లైనింగ్ పనులు ప్రారంభం

ముదిగుబ్బ: మండల పరిధిలోని మలకవేమల క్రాస్ యనుములవారిపల్లి దగ్గర శనివారం హంద్రీనీవా కాలువ లైనింగ్ పనులను రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వివివధ సమస్యలపై ప్రజల మంత్రికి అర్జీల సమర్పించారు. వాటిని స్వీకరించిన మంత్రి... వీలైనంత త్వరగా పరిష్కారం చేస్తామన్నారు. కార్యక్రమంలో ధర్మవరం ఆర్డీఓ మహేష్, ప్రాజెక్ట్ మేనేజర్ వెంకటరావు, ఎంపీపీ ఆదినారాయణ, వైస్ ఎంపీపీ వెంకటరెడ్డి పాల్గొన్నారు.

ప్లాస్టిక్ కాటు.. చేటు!

పూలు, పండ్లతో పాటు ఏ చిన్నపాటి వస్తువు కొన్నా ప్లాస్టిక్ కవర్లలో చుట్టివ్వడం సాధారణమైంది. దీనికి తోడు ఇప్పుడు ఇడ్లీ వేసేందుకూ ప్లాస్టిక్ కవర్లనే వాడుతున్నారు. వేడీ వేడి సాంబార్‌ను, టీని సైతం ప్లాస్టిక్ కవర్‌లో పార్శిల్ చేస్తున్నారు. ఇలా విచ్చలవిడిగా ప్లాస్టిక్ వాడటం వల్ల అటు పర్యావరణానికి, ప్రజారోగ్యానికి తీవ్ర నష్టం జరుగుతోంది. అందువల్లే ప్రభుత్వాలు సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను నిషేధించాయి. కానీ ధర్మవరంలో మాత్రం ప్లాస్టిక్ కవర్ల వినియోగం తగ్గలేదు. పైగా ఇక్కడి నుంచే జిల్లాలోని వివిధ ప్రాంతాలకు నిషేధిత ప్లాస్టిక్ కవర్లు, ఇతర సామగ్రి ఎగుమతి అవుతోంది.

- ప్లాస్టిక్ కూపంగా ధర్మవరం
- యథేచ్ఛగా ప్లాస్టిక్ వస్తువుల వినియోగం
- కీలకంగా మారిన ముగ్గురు వ్యాపారులు
- ఇతర ప్రాంతాలకూ 'ప్లాస్టిక్' సరఫరా
- కట్టడి చేయడంలో మున్సిపల్ అధికారులు విఫలం
- దెబ్బతింటున్న పర్యావరణం, ప్రజారోగ్యం



ప్లాస్టిక్ వస్తువు పేరు	భూమిలో కలిసేందుకు పట్టే సమయం
ప్లాస్టిక్ బాటిళ్లు	450 నుంచి 500 సంవత్సరాలు
ప్లాస్టిక్ బ్యాగులు	100 నుంచి 300 సంవత్సరాలు
ప్లాస్టిక్ స్ట్రాలు	200 నుంచి 500 సంవత్సరాలు
ప్లాస్టిక్ కవర్లు	400 నుంచి 500 సంవత్సరాలు

ధర్మవరం: ప్రజారోగ్యాన్ని, పర్యావరణాన్ని దెబ్బతీసే ప్లాస్టిక్ వినియోగంపై ప్రభుత్వాలు నిషేధించాయి. కానీ జిల్లాలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ కవర్లు, ఇతర సామగ్రి విక్రయాలు విచ్చల విడిగా సాగుతున్నాయి. ఇందులో ధర్మవరం మున్సిపాలిటి జిల్లాలోనే ప్రథమ స్థానంలో నిలుస్తోంది. దీంతో రోడ్డు ప్రక్కన, డ్రైనేజీలలో ఎక్కడ చూసినా ప్లాస్టిక్ కవర్లు దర్శనమిస్తున్నాయి. పట్టణానికి చెందన కొందరు వ్యాపారులు జిల్లాలోని పలు ప్రాంతాలకూ ప్లాస్టిక్ కవర్లను సరఫరా చేస్తున్నట్లుగా తెలుస్తోంది.

నిబంధనలు బేఖాతర్

40 మైక్రాన్‌ల కంటే తక్కువ మందం ఉండే ప్లాస్టిక్ వస్తువులను ప్రభుత్వం నిషేధించింది. ఈ ప్లాస్టిక్ కవర్‌లు గానీ, వస్తువులు గానీ ఎక్కడా కూడా విక్రయించ కూడదు. కానీ మున్సిపల్ అధికారులు ప్లాస్టిక్ నిషేధంపై దృష్టి సారించకపోవడంతో పట్టణంలోని వ్యాపారులు, చిరు వ్యాపారులు నిబంధనలు బేఖాతర్ చేస్తున్నారు.

ప్లాస్టిక్ ఎగుమతులకు అడ్డాగా ధర్మవరం

ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన వ్యాపారులు కంపెనీల నిర్వాహకులతో ఒప్పందం కుదుర్చుకుని నిషేధిక ప్లాస్టిక్ కవర్లు, ఇతర సామగ్రిని భారీగా నిల్వ చేసుకుని విక్రయాలు జరుపుతున్నారు. పట్టణంలోని పీఆర్‌టీ సర్కిల్, అంజుమన్ సర్కిల్, కాలేజ్ సర్కిల్‌లో ముగ్గురు వ్యాపారులు నిషేధిక ప్లాస్టిక్ కవర్లను కదిరి, హిందూపురం, పెనుగొండ, మడకశిర, రాప్తాడులకు ఎగుమతి చేస్తున్నట్లు సమాచారం. 40 మైక్రాన్‌ల కంటే తక్కువ మందం ఉన్న ప్లాస్టిక్ వస్తువులను కిలో రూ.130 చొప్పున అమ్ముతున్నట్లు తెలుస్తోంది.

అధికారులకు ముడుపులు

ప్లాస్టిక్ హోల్‌సేల్ వ్యాపారులు మున్సిపాలిటిలోని కొందరు అధికారులకు ప్రతి నెలా ముడుపులు ముట్టజెపుతూ ప్లాస్టిక్ విక్రయాలను యథేచ్ఛగా కొనసాగిస్తున్నారు. అందువల్లే అధికారులు కూడా సదరు వ్యాపారుల గోడౌన్‌లు, దుకాణాల వైపు చూడటం లేదు. ఒకవేళ ప్రభుత్వం నుంచి ఒత్తిడి వస్తే హడావుడి చేస్తారు. తోపుడు బండ్ల వ్యాపారులు, కిరాణా షాపు యజమానులకు జరిమానా విధించి చేతులు దులుపుకుంటున్నారు. ఫలితంగా మున్సిపాలిటి పరిధిలో ప్లాస్టిక్ వాడకం ఎక్కువైంది. దీంతో ప్రజారోగ్యం, పర్యావరణం కూడా దెబ్బతింటోంది. ప్లాస్టిక్ కవర్లను ఎక్కడపడితే అక్కడ పడేస్తుండటంతో వాటిని తిని మూగజీవాలు మృతి చెందుతున్నాయి.

కఠిన చర్యలు తీసుకోవాలి



ప్లాస్టిక్‌ను విక్రయించే బడా వ్యాపారులపై మున్సిపల్ అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలి. తద్వారా ప్లాస్టిక్ నివారణ సాధ్యమవుతుంది. అలాకాకుండా చిరు వ్యాపారులకు జరిమానా విధించడం ద్వారా ఎలాంటి ప్రయోజనం ఉండదు. మున్సిపాలిటిలో విపరీతంగా ప్లాస్టిక్ వినియోగించడం వల్ల పర్యావరణం దెబ్బతింటోంది. అధికారులు స్పందించి చర్యలు చేపట్టి ప్రజల్లో అవగాహన పెంపొందించాలి.

–చందమూరి నారాయణరెడ్డి, 37వ వార్డు కౌన్సిలర్, ధర్మవరం

చర్యలు తీసుకుంటాం



మున్సిపాలిటి పరిధిలో ప్లాస్టిక్ కట్టడి కోసం కృషి చేస్తున్నాం. ప్రజల్లోనూ అవగాహన పెంపొందిస్తున్నాం. ప్లాస్టిక్‌ను విక్రయించే వ్యాపారులు ఎంతటి వారైన ఉపేక్షించేది లేదు. కఠిన చర్యలు చేపడతాం.

–ప్రమోద్‌కుమార్, మున్సిపల్ కమిషనర్, ధర్మవరం

మడకశిరలో భారీ అగ్ని ప్రమాదం

- మార్కెట్ యార్డులో తాగునీటి పైపుల దగ్ధం
- రూ.కోట్లలో ఆస్తినష్టం



మంటలు వ్యాపించడంతో తగలబడిపోతున్న మార్కెట్ యార్డులోని షెడ్డు

మడకశిర: స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో శనివారం సాయంత్రం భారీ అగ్ని ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో వేలాది తాగునీటి సరఫరా పైపులు దగ్ధమయ్యాయి. రూ.కోట్లల్లో ఆస్తి నష్టం జరిగినట్లు అధికారులు చెబుతున్నారు.

సాయంత్రం 4 గంటల సమయంలో మంటలు

వైఎస్సార్ సీపీ హయాంలో రూ.68 కోట్లతో మడకశిర మున్సిపాలిటీ పరిధిలోని ఏఐఐబీ (ఏషియన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్ స్కీం) కింద తాగునీటి పథకాన్ని చేపట్టారు. ఓవర్ హెడ్ ట్యాంకుల నిర్మాణం కూడా పూర్తయ్యింది. ప్రస్తుతం ట్యాంకుల నుంచి పైప్‌లైన్లు ఏర్పాటు చేసి పట్టణ ప్రజలకు తాగునీరు సరఫరా చేయాల్సి ఉంది. అయితే ప్రభుత్వం మారడంతో పనులు మధ్యలోనే ఆగిపోయాయి. ఈ నేపథ్యంలో ఈ పథకానికి సంబంధించిన వేలాది ప్లాస్టిక్ పైపులు, ఇతర సామగ్రిని వ్యవసాయ మార్కెట్ యార్డులోని ఓ రేకుల షెడ్‌లో నిల్వ ఉంచారు. శనివారం సాయంత్రం 4 గంటల సమయంలో ఒక్కసారిగా మార్కెట్ యార్డులో మంటలు చెలరేగాయి. మార్కెట్ యార్డులోని రేకుల షెడ్‌లో నిల్వ ఉంచిన పైపులకు కూడా మంటలు వ్యాపించాయి. మార్కెట్ యార్డును పూర్తిగా పొగకమ్మేసింది. విషయం తెలుసుకున్న ట్రైనీ డీఎస్పీ ఉదయపావని, మున్సిపల్ కమిషనర్ రంగస్వామి, తహసీల్దార్ కరుణాకర్ వెంటనే ఘటన స్థలానికి చేరుకున్నారు. మూడు ఫైర్ ఇంజిన్లను రంగంలోకి దింపారు. అగ్నిమాపక శాఖ అధికారులు కొన్ని గంటల పాటు శ్రమించి మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. ఎలాంటి ప్రాణ నష్టం జరగకపోవడంతో అధికారులు ఊపిరిపీల్చుకున్నారు. అయితే అగ్ని ప్రమాదానికి కారణం ఏమిటన్నది స్పష్టంగా తెలియరాలేదు. దీనిపై అధికారులు ఆరా తీస్తున్నారు.



మంటలార్పుతున్న ఫైర్ సిబ్బంది



మంటల్లో కాలిపోతున్న పైపులు

నాణ్యమైన వైద్యం అందించాలి

- ఎన్టీఆర్ వైద్య సేవలపై విస్తృతంగా అవగాహన కల్పించాలి
- మాతా, శిశు మరణాల తగ్గింపునకు చర్యలు చేపట్టాలి
- ఆస్పత్రి కమిటీ సమావేశంలో కలెక్టర్ టీఎస్ చేతన్



ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ టీఎస్ చేతన్

హిందూపురం టౌన్: నిరుపేదలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని కలెక్టర్ టీఎస్ చేతన్ వైద్యులకు సూచించారు. శనివారం పట్టణంలోని జిల్లా ప్రభుత్వాస్పత్రిలోని సమావేశ మందిరంలో జిల్లా ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో జిల్లా ప్రభుత్వ ఆసుపత్రుల కోఆర్డినేటర్ తిపేంద్ర నాయక్, హిందూపురం జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ లింగన్న, హిందూపురం మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు, ఆర్‌ఎంఓ డేవిడ్ రాజ్, ఎన్టీఆర్ వైద్య సేవ ఆరోగ్యశ్రీ కోఆర్డినేటర్ శ్రీదేవి, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి శ్రీనివాస్‌రెడ్డిలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఆసుపత్రి అభివృద్ధి పనులకు ఆమోదం తెలిపామని, ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలన్నారు. అత్యవసర చికిత్స విభాగంలో వైద్యులు, వైద్య సిబ్బంది నిరంతరం అందుబాటులో ఉండాలన్నారు.ప్రతి వైద్యుడూ సాయంత్రం 4 గంటల వరకు కచ్చితంగా విధుల్లో ఉండాల్సిందేనన్నారు. ఎన్టీఆర్ వైద్య సేవలు, స్పెషలిస్ట్ డాక్టర్ల ద్వారా ఇంకా మెరుగ్గా రోగులకు అందించాలని, వచ్చిన నిధులను ఆసుపత్రి అభివృద్ధి కోసం వినియోగించుకోవాలన్నారు. మెరుగైన వైద్య సేవలు అందించి, మాతా శిశు మరణాలు తగ్గించడంతో పాటు ఓపీ, ఐపీ సేవలు మెరుగుపరచాలన్నారు. ఆస్పత్రికి వచ్చే వారంతా నిరుపేదలేనన్న విషయాన్ని గుర్తుంచుకుని వీలైనంత వరకూ కేసులను ఇతర ప్రాంతాలకు సిఫారసు చేయకుండా ఇక్కడే వైద్యం అందించే అందించాలని సూచించారు. అలాగే క్రిటికల్ కేర్ బ్లాకు సివిల్ వర్క్స్ పనులు త్వరితగతిన పూర్తిచేయాలని, నూతన భవనాన్ని సెప్టెంబర్ నాటికి అందుబాటులోకి తేవాలని ఆదేశించారు. అనంతరం ఆస్పత్రి సమీపంలోని అన్న క్యాంటీన్‌ను కలెక్టర్ పరిశీలించారు.

క్లుప్తంగా

మడకశిరలో 20న జాబ్‌మేళా

మడకశిర: పట్టణంలోని ఎస్‌వైటీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 20న ఉదయం 10 గంటలకు జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి హరికృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ఐదు కంపెనీల ప్రతినిధులు పాల్గొని ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. టెన్త్, ఇంటర్, డిగ్రీ తదితర కోర్సులు పూర్తి చేసిన యువతీ యువకులు బయోడేటా, ఫొటోలు, విద్యార్హత సర్టిఫికెట్లతో జాబ్‌మేళాలో పాల్గొనాలని కోరారు. ఎంపికైన వారు హిందూపురం, పెనుకొండ, హైదరాబాద్, బెంగళూరులో పని చేయాల్సి ఉంటుందని తెలిపారు.

మా ఉద్యోగాలు క్రమబద్ధీకరించండి

బత్తలపల్లి: సమగ్ర శిక్షలో 13 ఏళ్లుగా పనిచేస్తున్న తమ ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలని, లేనిపక్షంలో ఎంటీఎస్ హెచ్‌ఆర్ పాలసీ అమలు చేయాలని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌కు క్లస్టర్ మొబైల్ రిజర్వ్ టీచర్లు (సీఎంఆర్‌టీలు) విన్నవించారు. శనివారం బత్తలపల్లి బాలికల ఉన్నత పాఠశాలలో వసతి గృహం ప్రారంభోత్సవానికి విచ్చేసిన మంత్రికి సీఆర్‌ఎంటీ సంఘం జిల్లా అధ్యక్షుడు బాబజాన్‌తో పాటు పలువురు నాయకులు కలిసి తమ డిమాండ్లను వివరించారు. తమను ఉపాధ్యాయులుగా క్రమబద్ధీకరణ చేయాలని, రిటైర్డు వయసు 62 సంవత్సరాలకు పెంచడంతోపాటు గ్రాట్యుటీ చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో సంఘం గౌరవాధ్యక్షులు జి.వి.రమణ, రాష్ట్ర నాయకులు భాస్కర్‌నాయుడు, మహిళా నాయకురాలు సునీత, సౌజన్య, సుకన్యతో పాటు సీనియర్ నాయకులు నాగయ్య, శివ, నారాయణస్వామి, నాగరాజు, సదాశివుడు తదితరులు పాల్గొన్నారు.

సర్కారు వైఖరితోనే ప్రీకాట్ మిల్లు మూత

పరిగి: కూటమి సర్కారు వైఖరి వల్లే కొడిగెనహళ్లి ప్రీకాట్ స్పిన్నింగ్ మిల్లు మూతపడుతోందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు వి.రాంభూపాల్ విమర్శించారు. శనివారం ఆయన ప్రీకాట్ మిల్లు వద్ద విలేకరులతో మాట్లాడారు. ఎన్టీఆర్ హయాంలో రాయలసీమకు ప్రత్యేక రాయితీలిచ్చి పారిశ్రామిక హబ్‌గా మార్చాలన్న లక్ష్యంతో అత్యంత వెనకబడిన పరిగి మండలంలో ప్రీకాట్ మిల్లు నిర్మాణానికి తోడ్పాటునందించారన్నారు. చుట్టుపక్కల మండలాలు, తమిళనాడు, ఒడిషా, బిహార్ రాష్ట్రాల కార్మికులు ఇక్కడ పని చేస్తున్నారన్నారు. ప్రత్యక్షంగా, పరోక్షంగా వేలాది కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయన్నారు. 43 ఏళ్లు నిరంతరాయంగా నడిచిన ఫ్యాక్టరీని మూసివేయడానికి యాజమాన్యం తీసుకుంటున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్నామన్నారు. యాజమాన్యం చెబుతున్న కారణాలన్నింటికీ ప్రభుత్వమే బాధ్యత వహించాలన్నారు. పక్క రాష్ట్రాలతో పోల్చితే ఆంధ్రప్రదేశ్‌లో విద్యుత్ చార్జీలు భారీగా ఉండటమే మిల్లు మూసివేతకు ప్రత్యేక కారణంగా చెబుతున్నారన్నారు. ప్రభుత్వం, మిల్లు యాజమాన్యం అవలంబిస్తున్న విధానాల వల్ల అంతిమంగా కార్మికుల కుటుంబాలు అన్యాయమైపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ అంశంపై మంత్రి సవిత, ఎన్టీఆర్ కుమారుడిగా హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణతో సహా ముఖ్యమంత్రి చంద్రబాబు స్పందించి మిల్లు మూతపడకుండా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

చెరువులు నిండేనా..?

- పది రోజులైనా ఒక్కటీ నిండలేదు
- హంద్రీ–నీవా నీటిపై సన్నగిల్లుతున్న ఆశలు
- కాలువ లీకేజీలతో వృథా అవుతున్న నీరు
- ప్రణాళిక లేకే చెరువులకు నీటి చేరిక ఆలస్యం
- పట్టించుకోని ఎమ్మెల్యే బాలకృష్ణ
- ఆందోళనలో ఆయకట్టు రైతులు

చిలమత్తూరు: హంద్రీ–నీవా సుజల స్రవంతి కాలువ ద్వారా చెరువులకు నీరు నింపుతామన్న పాలకుల ప్రకటన ప్రచార్భాటానికే పరిమితమైంది. హిందూపురం నియోజకవర్గంలోకి హంద్రీ–నీవా నీరు వదిలి పది రోజులవుతోంది. ఇప్పటి వరకు ఒక్క చెరువు పూర్తిగా నిండలేదు. చలివెందల చెరువుకు అరకొరగా నీళ్లిచ్చి అప్పుడే లేపాక్షి మండలం కొండూరుకు మళ్లిస్తున్నారు. వచ్చిన నీరంతా ఎక్కడ పోతోందో అర్థంకావడం లేదు. చిలమత్తూరు మండలంలో కూడా రెండు చెరువులకు నీళ్లు రావాల్సి ఉంది. వేసవిలో హంద్రీ–నీవా జలాలపై గంపెడు ఆశలు పెట్టుకున్న రైతులకు చివరకు కన్నీళ్లే మిగిలే పరిస్థితులు కనిపిస్తున్నాయి. నియోజకవర్గంలో 39 చెరువులను నీటితో నింపాల్సి ఉంది. 10 రోజులు కావొస్తున్నా ఒక్క చెరువూ నిండలేదు. హిందూపురం చెరువులు నిండటానికి 0.85 టీఎంసీల నీరు అవసరం. గొల్లపల్లి రిజర్వాయర్‌లో నీటి నిల్వ తక్కువగా ఉంది. ఈ పరిస్థితుల్లో అన్ని చెరువులు నింపడం అసాధ్యంగా కనిపిస్తోంది. మరోవైపు హంద్రీ–నీవా కాలువ బలహీనంగా ఉండటంతో నీరు లీకేజీ అవుతోంది. లైనింగ్ పనులు పూర్తి చేయకనే హడావుడిగా నీరు వదలడం వల్లే ఈ దుస్థితి ఏర్పడిందని రైతులు చెబుతున్నారు.

ఇప్పటి వరకూ మలుగూరుకు మాత్రమే..

హిందూపురం నియోజకవర్గంలోని మలుగూరు చెరువుకు మాత్రమే హంద్రీ–నీవా జలాలు అరకొరగా వచ్చాయి. పెనుకొండ నియోజకవర్గంలోని చెరువులకు నీరు నిలుపుకొనేందుకు మంత్రి సవిత ప్రయత్నం చేస్తుంటే.. హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ తన పరిధిలోని చెరువుల గురించి పట్టించుకోవడం లేదు. గొల్లపల్లి రిజర్వాయర్‌లో నీరు తగ్గిపోతే హిందూపురం నియోజకవర్గంలోని 39 చెరువుల పరిస్థితి ఏంటని ఆయకట్టు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



హిందూపురం వద్ద హంద్రీనీవా కాలువ ప్రస్తుత పరిస్థితి

అన్ని చెరువులూ నింపాల్సిందే



హంద్రీ–నీవా నీటితో హిందూపురం నియోజకవర్గంలోని 39 చెరువులనూ పూర్తిగా నింపాల్సిందే. అరకొర నీళ్లిచ్చి చేతులు దులుపుకోవాలని చూస్తే ఊరుకోబోం. 10 రోజుల నుంచి నీళ్లొస్తున్నాయని చెబుతున్నారు. మరి ఇప్పటి వరకు ఎన్ని చెరువులు నింపారో ఎమ్మెల్యే బాలకృష్ణ, అధికారులు సమాధానం చెప్పాలి. ఎమ్మెల్యేకు నియోజకవర్గ రైతులపై ప్రేమ ఉంటే ఈపాటికి అన్ని చెరువులకూ నీళ్లందేలా చూసేవారు. చెరువులకు పూర్తిస్థాయిలో నీరు ఎప్పుడు వదులుతారో అధికారులు స్పష్టత ఇవ్వాలి.

– టీఎన్ దీపిక, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త, హిందూపురం

చెరువులు నిండితేనే పంటలు



చిలమత్తూరు మండలం దేమకేతేపల్లి పంచాయతీలో కొర్లకుంట, దేమకేతేపల్లి చెరువులకు హంద్రీ–నీవా నీరు వదులుతారు. ప్రస్తుతం కొండూరు చెరువుకు నీళ్లు వదిలారని, అయితే అవి సరిగా రావడం లేదని అంటున్నారు. అదే నిండకపోతే ఇక మా చెరువులకు నీళ్లు ఎలా వస్తాయి? బోరుబావుల్లో నీరు తగ్గిపోయే పరిస్థితులు ఉన్నాయి. చెరువులు నిండితేనే పెట్టిన పంటలు చేతికొస్తాయి. నీళ్లు త్వరగా వదలాలి. అధికారులు, పాలకులు స్పందించాలి.

– చంద్రశేఖర్‌రెడ్డి, రైతు, డి.గొల్లపల్లి

సెల్‌ఫోన్ చూడొద్దన్నందుకు టెన్త్ విద్యార్థి పరార్

- రైల్వే స్టేషన్‌లో గుర్తించిన పోలీసులు

పెనుకొండ: పరీక్షల వేళ సెల్‌ఫోన్ చూడవద్దని తండ్రి మందలించాడని పదో తరగతి విద్యార్థి ఇంటి నుంచి పరారయ్యాడు. ఎస్‌ఐ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని నారాయణమ్మ కాలనీ సమీపాన నివాసముంటున్నా లికిరెడ్డి వాయునందన్‌రెడ్డి పదో తరగతి చదువుతున్నాడు. సోమవారం నుంచి పరీక్షలు మొదలవుతాయి. అయితే శుక్రవారం రాత్రి సెల్‌ఫోన్ చూస్తుండడంతో తండ్రి నాగార్జునరెడ్డి గమనించి గట్టిగా మందలించాడు. దీంతో మనస్తాపానికి గురైన వాయునందన్‌రెడ్డి ఇంటినుంచి పరారయ్యాడు. కుమారుడు ఎంత సేపైనా ఇంటికి రాకపోవడంతో పలు చోట్ల వెదికిన తండ్రి, ఇతర కుటుంబసభ్యులు అదేరోజు రాత్రి 11 గంటల తర్వాత ఎస్‌ఐ వెంకటేశ్వర్లును కలసి ఫిర్యాదు చేశాడు. ఎస్‌ఐ వెంటనే పోలీసు సిబ్బందితో బస్టాండ్, రైల్వేస్టేషన్, జాతీయ రహదారి, పలు హోటళ్ల వద్ద గాలింపు చేపట్టారు. చివరకు రైల్వేస్టేషన్‌లో దాక్కుని ఉండగా పోలీసులు అదుపులోకి తీసుకుని, విద్యార్థిని మందలించి చక్కగా చదువుకోవాలని, ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని సూచించారు. అనంతరం తల్లిదండ్రులకు బాలుడిని అప్పగించారు.

చికిత్స పొందుతు చిన్నారి మృతి



ప్రార్థన (ఫైల్)

రొళ్ల: మడకశిర సమీపాన వెటర్నరీ పాలిటెక్నిక్ కళాశాల వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కొడగార్లగుట్లకు చెందిన సన్నలింగప్ప కుమార్తె ప్రార్థన (3) శనివారం మృతి చెందింది. ఇదే ప్రమాదంలో సన్నలింగప్ప కుమారుడు గోకుల్ గాయపడి ఆస్పత్రిలో కోలుకుంటున్న విషయం విదితమే. కాగా ప్రార్థన అంత్యక్రియలు సాయంత్రం స్వగ్రామంలో పూర్తి చేశారు.

గుప్తనిధి తవ్వకాల కేసులో ఐదుగురి అరెస్ట్

నల్లమాడ: గుప్త నిధి కోసం తవ్వకాలు చేపట్టిన కేసులో ఐదుగురిని పోలీసులు అరెస్టు చేశారు. సీఐ నరేంద్రరెడ్డి శనివారం మీడియాకు వివరాలు వెల్లడించారు. మండల కేంద్రానికి సమీపంలోని సుంకులమ్మ గుడి వద్ద గుప్త నిధుల కోసం తవ్వకాలు జరుపుతున్నట్లు సమాచారం అందడంతో తమ సిబ్బందితో హుటాహుటిన వెళ్లి ఐదుగురిని అరెస్ట్ చేశామన్నారు. గోరంట్లకు చెందిన మారుతీకుమార్, శ్రీరాములు, నరసింహులు, హారీఫుల్లా, గోపీ అరెస్టయిన వారిలో ఉన్నారు. వీరి నుంచి కారు, తవ్వకాలకు ఉపయోగించిన వస్తువులను సీజ్ చేశామన్నారు.

చెట్టుపై నుంచి పడి కూలీ మృత్యువాత




కెంచప్ప (ఫైల్)

పావగడ: కుందుర్పి మండలం శ్రీమజ్జనపల్లికి చెందిన వ్యవసాయ కూలీ కెంచయ్య (42) శనివారం చింతచెట్టుపై నుంచి ప్రమాదవశాత్తూ కింద పడి మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు... కెంచయ్య రోజువారీ కూలి పనుల్లో భాగంగా శనివారం ఉదయం చింతకాయలు కోయడానికి సమీపంలోని పుట్రాళ్లపల్లి వద్దకు వెళ్లాడు. అక్కడ చింతకాయలు కోసే క్రమంలో కాలు జారి చెట్టుపైనుంచి కింద పడ్డాడు. తలకు, మర్మావయవాలకు తీవ్రగాయాలవడంతో వెంటనే కళ్యాణదుర్గం ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్తుండగా మార్గం మధ్యలో మృతి చెందాడు. కెంచయ్యకు భార్య నేత్ర, ముగ్గురు కూతుర్లు ఉన్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కాళేశ్వర్ ఆశయ సాధనకు కృషి



రూ.28 లక్షల మెగా చెక్కును పోలీసులకు అందజేస్తున్న శిల్ప



సాయి కాళేశ్వర్ సమాధి వద్ద నివాళి అర్పిస్తున్న శిల్ప

పెనుకొండ: ప్రముఖ ఆధ్యాత్మికవేత్త, శివసాయి మందిరం వ్యవస్థాపకుడు, షిర్డీసాయి గ్లోబల్ ట్రస్ట్ అధినేత సాయి కాళేశ్వర్ ఆశయ సాధనకు కృషి చేస్తామని ట్రస్ట్ నిర్వాహకురాలు శిల్ప తెలిపారు. శనివారం పెనుకొండలోని శివసాయి మందిరంలో సాయి కాళేశ్వర్ 13వ వర్ధంతి నిర్వహించారు. ఆయన సమాధి వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం శిల్ప నివాళులర్పించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ట్రస్ట్ నిర్వాహకురాలు శిల్ప సీసీ కెమెరాల ఏర్పాటు కోసం పోలీసు శాఖకు రూ.28 లక్షల చెక్కును విరాళంగా అందజేశారు. సయికాళేశ్వర్ బాటలోనే గతంలో మాదిరిగా విద్య, వైద్యం, తాగునీరు తదితర సామాజిక సేవా కార్యక్రమాలు కొనసాగిస్తామన్నారు. అనంతరం కంటి ఆపరేషన్లు చేయించుకున్న వృద్ధులకు, రోగులకు కంటి అద్దాలను పంపిణీ చేశారు. డీఎస్పీ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పెనుకొండలో నేరాలు అరికట్టేందుకు సీసీ కెమెరాలు అవసరమని ట్రస్ట్ నిర్వాహకురాలి దృష్టికి తీసుకురాగా.. ఆమె వెంటనే స్పందించి ఆర్థికసాయం అందించడం హర్షించదగ్గ విషయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీఐ రాఘవన్, ఎస్‌ఐ వెంకటేశ్వర్లు, ప్రముఖ న్యాయవాది గురుప్రసాద్, మదన్‌మోహన్‌రెడ్డి, ప్రగతి శ్రీనివాసులు, జాన్‌ప్రియనాథ్, నాగిరెడ్డి, చిట్టిబాబు, హరి, బాబు ఇతర ఆశ్రమ సిబ్బంది పాల్గొన్నారు.

కరువు, రైతు ఆత్మహత్యలకు కారకులెవరు?

హిందూపురం: రాయలసీమలో నిత్య కరువులు, వలసలు, రైతు ఆత్మహత్యలకు కారకులెవరని జలసాధన సమితి సభ్యులు ప్రశ్నించారు. హంద్రీ–నీవా ప్రాజెక్టు ప్రధాన కాలువ లైనింగ్ పనులు రద్దుచేసి కాలువ వెడల్పు చేయాలని కోరుతూ జలసాధన సమితి ఆధ్వర్యంలో శనివారం హిందూపురంలోని ఇందిరా పార్కు కల్లూరు సుబ్బారావు విగ్రహం వద్ద జలసాధన సమితి నాయకులు కరపత్రాలు విడుదల చేశారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చిన కలెక్టర్ చేతన్‌ను కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా జలసాధన సమితి గౌరవాధ్యక్షులు సీనియర్ అడ్వకేట్ రామచంద్రారెడ్డి, అధ్యక్షుడు వెంకటరామిరెడ్డి, ప్రధాన కార్యదర్శి గంగిరెడ్డి, ఓపీడీఆర్ రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రీనివాసులు మాట్లాడుతూ హంద్రీ–నీవా ప్రాజెక్టు ద్వారా నీళ్లు వస్తున్నప్పటికీ ఆశించిన ప్రయోజనం నెరవేరడం లేదన్నారు. కొన్ని చెరువులు మాత్రమే నీరు ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారన్నారు. వాస్తవంగా విడుదల అవుతున్న 27 టీఎంసీలు నీటిలో ఉమ్మడి అనంతపురం జిల్లాకు 24 టీఎంసీలు వచ్చాయన్నారు. ఉమ్మడి జిల్లాలో 2,500 చెరువులు ఉండగా.. 89 చెరువులకు మాత్రమే నీరు ఇస్తున్నారన్నారు. హంద్రీ–నీవా కాలువను వెడల్పు చేసి వంద టీఎంసీలను ఎత్తిపోతలతో కొత్త ఆయకట్టుకు నీరు ఇస్తే ఉమ్మడి జిల్లాలకు విస్తృత ప్రయోజనాలు ఉంటాయన్నారు. అలాకాకుండా కాలువను వెడల్పు చేయకుండా లైనింగ్ చేయటం వల్ల ప్రయోజనం లేకపోగా నష్టమే ఎక్కువగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో జలసాధన సమితి ఓపీడీఆర్ రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రీనివాసులు, రచయిత సడ్లపల్లి చిదంబరరెడ్డి, రైతు సంఘం నాయకులు సిద్ధారెడ్డి, జలసాధన సమితి నాయకులు ఫరూక్, జమీల్, అమానుల్లా, దాసరి హరి, సీఐటీయూ నాయకులు రాము, పర్యావరణవేత్త భాస్కర్‌రెడ్డి, ఎస్‌యూసీఐ నాయకులు గిరీష్, తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న జల సాధన సమితి సభ్యులు

జేఎన్‌టీయూ(ఏ) స్నాతకోత్సవ నోటిఫికేషన్ విడుదల

అనంతపురం: జేఎన్‌టీయూ అనంతపురం 14వ స్నాతకోత్సవ నోటిఫికేషన్‌ను విడుదల చేసినట్లు వీసీ ప్రొఫెసర్ హెచ్. సుదర్శనరావు తెలిపారు. ఏప్రిల్, మే నెలలో నిర్వహించే స్నాతకోత్సవానికి దరఖాస్తు చేసుకోవడానికి అనుమతి మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. 2023–24 విద్యా సంవత్సరంలో బీటెక్, ఎంటెక్, పీజీ, పీహెచ్‌డీ పూర్తి చేసిన వారు దరఖాస్తు చేసుకోవచ్చు. ఏప్రిల్ 15 లోపు తుది గడువుగా నిర్దేశించారు. ఆన్‌లైన్ విధానంలో దరఖాస్తు చేసుకోవడానికి వెసులుబాటు కల్పించారు. పూర్తి వివరాలు జేఎన్‌టీయూ అనంతపురం (www.jntua.ac.in) వెబ్‌సైట్‌లో చూడాలి.

కుటుంబ కలహాలతో వ్యక్తి బలవన్మరణం

చిలమత్తూరు: మండలంలోని మొరంపల్లికి చెందిన రాఘవేంద్ర (45) శనివారం తెల్లవారుజామున ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్‌ఐ మునీర్ అహ్మద్ తెలిపిన వివరాల మేరకు.. రాఘవేంద్ర తాగుడుకు అలవాటు పడ్డాడు. అప్పులు ఎక్కువ చేయడంతో కుటుంబంలో కలహాలు మొదయ్యాయి. ఈ క్రమంలో మనస్తాపం చెందిన రాఘవేంద్ర శనివారం తెల్లవారుజామున ఉరివేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఇతనికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి, కేసు నమోదు చేశారు.


లైనింగ్ పనులు ఆపకపోతే ఉద్యమాలు తప్పవు



మాట్లాడుతున్న రాంభూపాల్

సోమందేపల్లి: హంద్రీ–నీవా పనులు రద్దు చేసి కాలువ వెడల్పు చేయకపోతే ఉద్యమాలు తప్పవని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్ తెలిపారు. శనివారం ఆయన సోమందేపల్లిలోని సీపీఎం కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. కొంతమంది స్వార్థం కోసం లైనింగ్ పనులపై ప్రభుత్వం మక్కువ చూపుతూ రైతులకు తీవ్ర నష్టం చేకూరుస్తోందన్నారు. ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం ప్రస్తుతం వస్తున్న 40 టీఎంసీల కన్నా అదనంగా నీరు ఇస్తామని ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. గొల్లపల్లి రిజర్వాయర్ ద్వారా చెరువులకు సాగునీటిని విడుదల చేయాలన్నారు. లైనింగ్ వల్ల జిల్లాలోని ఏడు నియోజకవర్గాల రైతులు తీవ్రంగా నష్టపోతారని, ప్రభుత్వ వెంటనే తన నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు వెంకటేష్ రాజగోపాల్, రంగప్ప, హనుమయ్య, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

బీటెక్ విద్యార్థి అదృశ్యం



లక్ష్మీకాంత్‌రెడ్డి

నల్లమాడ: ఎద్దులవాండ్లపల్లికి చెందిన లక్ష్మీకాంత్‌రెడ్డి అనే బీటెక్ విద్యార్థి అదృశ్యమయ్యాడు. వివరాలిలా ఉన్నాయి. రామ్మోహన్‌రెడ్డికి ఇద్దరు సంతానం. వీరు కొన్నేళ్ల క్రితం బెంగళూరుకు వలస వెళ్లి స్థిరపడ్డారు. పెద్ద కుమారుడు లక్ష్మీకాంత్‌రెడ్డి అనంతపురంలోని ప్రైవేట్ కళాశాలలో బీటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. ఈ నెల ఏడో తేదీన లక్ష్మీకాంత్‌రెడ్డి బెంగళూరుకు వస్తున్నానని తండ్రికి ఫోన్‌లో చెప్పి స్వగ్రామం ఎద్దులవాండ్లపల్లి నుంచి ద్విచక్రవాహనంలో బయల్దేరాడు. కొంతసేపటి తర్వాత తండ్రి ఫోన్ చేయగా స్విచాఫ్ అని వచ్చింది. అనుమానం వచ్చి అనంతపురం, బెంగళూరు ప్రాంతాల్లో గాలించినా కుమారుడి ఆచూకీ కన్పించలేదు. దీంతో రామ్మోహన్‌రెడ్డి శనివారం నల్లమాడ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ నరేంద్రరెడ్డి తెలిపారు.


త్వరలో హెచ్చెల్సీలో అత్యవసర పనులు

- హెచ్చెల్సీ కాలువను పరిశీలించిన ఎస్‌ఈ రాజశేఖర్

బొమ్మనహాళ్: తుంగభద్ర ఎగువ కాలువ (హెచ్చెల్సీ)కి త్వరలోనే అత్యవసర పనులు ప్రారంభిస్తున్నట్లు హెచ్చెల్సీ ఎస్‌ఈ రాజశేఖర్ తెలిపారు. శనివారం ఆయన మండల పరిధిలో హెచ్చెల్సీ కాలువను పరిశీలించారు. బొమ్మనహాళ్, కృష్ణాపురం, ఉంతకల్లు, మైలాపురం, ఉద్దేహాళ్ గ్రామాల సమీపంలోని 126,105,109వ కిలోమీటర్ల వద్ద కాలువ వంతెనలను పరిశీలించారు. నీటి ప్రవాహానికి అడ్డంగా లేకుండా కాలువలో ఉన్న వ్యర్థాలను తొలగించాలని స్థానిక అధికారులు, సిబ్బందికి ఆదేశించారు. అనంతరం విలేకరులతో ఎస్‌ఈ మాట్లాడుతూ హెచ్చెల్సీ అత్యవసర పనుల మరమ్మతుల కోసం రాష్ట్ర ప్రభుత్వం నిధులను కేటాయించిందన్నారు. 165 కిలోమీటర్ నుంచి 189 కిలోమీటర్ వరకు రూ.34.95 కోట్లతో పనులు జరుగుతాయని తెలిపారు. జూలై నాటికి పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. బొమ్మనహాళ్ మండలంలో రూ.16 కోట్లతో వంతెన, లైనింగ్ పనులు జరుగుతాయని తెలిపారు. ఎప్పటికప్పుడు పనులు పరిశీలిస్తూ నాణ్యతగా ఉండేలా చూస్తామని చెప్పారు. కార్యక్రమంలో జేఈఈ అల్తాఫ్, హెచ్చెల్సీ సిబ్బంది పాల్గొన్నారు.

నీరు తరగని పాలబావి

- రాత్రికి రాత్రే తవ్వించిన సాసవుల చిన్నమ్మ





సాసవుల చిన్నమ్మ తవ్వించిన పాలబావి

కదిరి: ముత్యాలచెరువుకు సమీపంలో పాలబావి ఉంది. ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి భక్తురాలైన కర్ణాటకకు చెందిన సాసవుల చిన్నమ్మ దీన్ని రాత్రికి రాత్రి తవ్వించినట్లు బ్రహ్మాండ పురాణం చెబుతోంది. ఈ బావిని కొంత లోతు తవ్విన తర్వాత కింద నుంచి కోడికూతతో పాటు రోకలితో ధాన్యం దంచుతున్న శబ్దం వినబడింది. ఈ విషయాన్ని వారు సాసవుల చిన్నమ్మకు చెప్పడంతో కింద మరో లోకం ఉందని భావించి తవ్వడం ఆపేశారు. తర్వాత వచ్చే వేసవికి ఆ బావి పొంగి ప్రవహించడం అందరినీ ఆశ్చర్యానికి గురి చేసింది. ఆ నీరు పాలవలె ఉండటం మరింత నివ్వెర పరిచింది. అప్పుడు ఈ ప్రాంత వాసులు సాసవుల చిన్నమ్మ భక్తిని మరింత మెచ్చుకున్నారు. ఎంతటి కరువు కాటకాలొచ్చినా ఈ పాలబావిలో మాత్రం నీళ్లు తగ్గవు. ఈ నీటిని నరసింహస్వామి భక్తులు పవిత్ర తీర్థంగా భావిస్తారు. శ్రీ ఖాద్రీ లక్ష్మీనరసింహ స్వామి ఆలయ దక్షిణ గోపురాన్ని కూడా సాసవుల చిన్నమ్మే నిర్మించినట్లు బ్రహ్మాండ పురాణం ద్వారా తెలుస్తోంది. శ్రీవారి బ్రహ్మోత్సవాలకు విచ్చేసే కర్ణాటకకు చెందిన భక్తులందరూ ఈ పాలబావిని చూసి వెళతారు. కాగా క్షీర కేతుడనే రాజు పుత్ర సంతానం కోసం ఈ పాలబావిలో స్నానమాచరించి తర్వాత నారసింహుని దర్శించుకున్నారని, అందుకే క్షీర తీర్థమని పిలుస్తున్నారని మరో కథనం.

పులగం వండిన గ్రామమే పులగంపల్లి

ఖాద్రీ లక్ష్మీనరసింహ స్వామి భక్తురాలు సాసవుల చిన్నమ్మ తమ పరివారంతో కర్ణాటక నుంచి శ్రీవారి దర్శనం కోసం వస్తుండేది. దారి మధ్యలో మధ్యాహ్న సమయంలో తమ వెంట వచ్చిన వారి ఆకలి తీర్చేందుకు సాసవుల చిన్నమ్మ కదిరి–బెంగళూరు రహదారి పక్కన పులగం వండి వడ్డించడం మొదలెట్టింది. తమ వెంట వచ్చిన వారితో పాటు దారి వెంబడి వెళ్లే వారందరికీ వడ్డించినా ఆ పాత్రలోని పులగం తరగలేదు. సాసవుల చిన్నమ్మ పులగం వండిన ప్రాంతాన్ని పులగంపల్లిగా నామకరణం చేశారు. ఇప్పటికీ పులగంపల్లిగా పిలుస్తున్నారు.

స్వచ్ఛత ఏదీ?



బాలాజీ టాకీస్ రోడ్డులో చెత్త దిబ్బలు ఇలా...

చిలమత్తూరు: హిందూపురంలో శనివారం స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్ చేతన్ హాజరవుతున్నారని సదరు ప్రదేశాన్ని మున్సిపల్ పాలకులు, అధికారులు శుభ్రం చేయించారు. ఊరి మధ్యలో బాలాజీ టాకీస్ రోడ్డులో చెత్తదిబ్బలను అలాగే వదిలేశారు. స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర అంటే ఇలా ఎక్కడ పడితే అక్కడ చెత్త దిబ్బలను వదిలేయడమేనా కలెక్టర్ సారూ అంటూ ప్రజలు విమర్శిస్తున్నారు.